క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి

వైవీయూ: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో 'మేరా మట్టి.. మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, బొటానికల్ గార్డెన్ నిర్వాహకులు ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల సేవలను ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి అభినందించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా విద్యార్థుల చేత పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విజయలక్ష్మిదేవి, శచీదేశి, ఎన్‌సీసీ అధికారిణి విన్నీతేజ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలి

వైవీయూ : 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరూ తప్పనిసరిగా యేడాదికి రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కడప ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్‌బెండోజల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేయరాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేయరాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి వన్‌టౌన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి శరత్, జిల్లా ఉపాధ్యక్షుడు లీలాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకుని వాటి గుర్తింపును రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కడపలోని ఇంటర్ ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏబీఎస్‌బి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వంలో మహిళా ఆర్థిక స్వావలంబన సాధికారతకు పెద్ద పీట వేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక 20/1 వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీ లో పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమకు ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందని పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బి. రత్నమ్మ అనే మహిళ తనకు వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.12, 29, 250 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. పి. శివమ్మ అనే మహిళ తనకు జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ కాపు నేస్తం, వైఎస్ఆర్ రైతు భరోసా, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9 లక్షల, 78 వేలు లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది.

ఈశ్వర్ రెడ్డి చర్చికి రూ. 50 వేలు విరాళం

తన 53 వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఈశ్వర్‌రెడ్డి చర్చికి రూ.50వేలు సొంత డబ్బు విరాళంగా ఇచ్చారు. అందుకు సంబంధించిన చెక్‌ను చర్చి ఫాస్టర్ మేరీ ఈశ్వర్ రెడ్డికి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు షఫీ, కె. బాబు, సానపురెడ్డి శివకోటిరెడ్డి, బాలస్వామిరెడ్డి, తోటక్రిష్ణ, మున్నా, మనోజ్, టీపీ వెంకట సుబ్బమ్మ, మియ్యా పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

బాలికల సంరక్షణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న అశ్విని

వైవీయూ : బాలికల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్, 'సఖీ–దిశ' సెంటర్ ఆధ్వర్యంలో 'సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలు – పరిష్కారాలు' అన్న అంశంపై అవగాహన కల్పించారు. సఖి–దిశ సెంటర్ పరిపాలనాధికారి ఎస్. అశ్విని మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలను, వాటి పరిష్కారం కోసం ఏర్పాటైన కౌన్సిలింగ్ సెంటర్‌ల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ సేవలు అభినందనీయం



ఏఎస్ఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న అదనపు ఎస్పీ

కడప అర్బన్: ప్రొద్దుటూరులో ప్రమాదంలో వున్న వృద్ధుడిని సమయస్ఫూర్తితో వేగంగా స్పందించి కాపాడిన ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్నను అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏఎస్ఐ సుబ్బన్నకు ప్రశంసాపత్రం అందజేశారు.

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన

కడప అర్బన్: విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. శుక్రవారం కడపలోని న్యాయ సేవా సదన్‌లో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు ర్యాగింగ్ చెడు ప్రభావాలు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతో పాటు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే శిక్షాస్పద నిబంధనలు మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ ప్రోగ్రాం‌ను నిర్వహించారు. జడ్జి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక టీంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టీంలో న్యాయమూర్తి, ఇద్దరు న్యాయవాదులు, సైక్రియాటిస్ట్, సోషల్ వర్కర్, రిటైర్డ్ విద్యాశాఖ అధికారి వుంటారు. ఈ టీమ్ కాలేజీలకు వెళ్లి పై అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు సీనియర్ న్యాయవాదులు చంద్రకాంతమ్మ, ప్రభాకర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకటరాముడు, సోషల్ వర్కర్ దశరథరామిరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ వి. నాగమునిరెడ్డి, వివిధ ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా 2.0లో కార్యక్రమంలో భాగంగా పోస్టల్ సిబ్బంది నగరంలో ర్యాలీ చేపట్టి జాతీయ జెండా విశిష్టతను వివరించారు. జాతీయ జెండాను రూ.25కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు విజయ్ భాస్కర్, భాస్కరెడ్డి, రమాశంకర్, ఇన్‌స్పెక్టర్ రెడ్డి బాష, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

భీమయ్య సేవలు ప్రశంసనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా చేనేత జౌళిశాఖ అధికారిగా భీమయ్య అందించిన సేవలు ప్రశంసనీయమని చేనేత సంఘాల నాయకులు నాగరాజు, శ్రీధర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఒంగోలు చేనేత రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లిన భీమయ్యను కడపలోని శాఖా కార్యాలయంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ చేనేతల సంక్షేమానికి భీమయ్య చేసిన కృషి మరువలేమన్నారు. భీమయ్య మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు శేషగిరిరావు, అహ్మద్, రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



భీమయ్యను సత్కరిస్తున్న అధికారులు, సొసైటీల ప్రతినిధులు









వైవీయూలో జాబ్‌డ్రైవ్‌లో 26 మందికి ఉద్యోగాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 26 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు వైవీయూ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్. వీరాంజనేయరెడ్డి తెలిపారు. టీవీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, డీసీబీ బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్ సంస్థల ప్రతినిధులు హాజరై ఎంబీఏ, ఎంకాం విద్యార్థుల అర్హత నైపుణ్యాలను పరిశీలించారు. ఎంపికలకు 76 మంది విద్యార్థులు హాజరుకాగా 26 మందిని ఎంపిక చేసినట్లు ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులు తెలిపారు. హెచ్‌ఆర్ విభాగం ప్రతినిధి ప్రశాంత్ పాల్గొన్నారు.

వైవీయూ వీసీకి వినతి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయంలో ఉర్దూ విభాగాన్ని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసి ఆచార్యుల పోస్టుల మంజూరుకు రాష్ట్ర ఉన్నత విద్య మండలికి ప్రతిపాదనలను పంపాలని వైవీయూ వీసీ చింతా సుధాకర్‌ను రూట నాయకులు కోరారు. ఈ విషయమై శుక్రవారం లెక్చరర్స్ వింగ్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వసీవుల్లా బక్తియార్‌లు వీసీ చింతా సుధాకర్‌ను వైవీయూలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఘనంగా నా భూమి–నా దేశం

కడప కల్చరల్ : ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నా భూమి నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం కడప నగరంలో ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గాంధీనగర్, బాల వికాస్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ఎర్రముక్కపల్లె సెంటర్‌లోని అమరవీరుల స్మారక స్థూపం చుట్టూ తిరిగారు. చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామన్నారు. నెమలిదిన్నె నాగవేణి మాట్లాడారు. ఈ సందర్భంగా భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు.

పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయాలి

కడప ఎడ్యుకేషన్: పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ కన్వీనర్ లయన్ కె. చిన్నపురెడ్డి పేర్కొన్నారు. ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కడప మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడారు.



అమర వీరుల స్థూపం వద్ద ఇంటాక్ ప్రతినిధులు, విద్యార్థులు

సమరయోధుల త్యాగాలు తెలియజెప్పాలి

వైవీయూ: భారత దేశంలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు నేటి తరానికి తెలియ జెప్పాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా 'నేటి భారత పౌరుల బాధ్యత' అన్న అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఆచార్య డి. విజయలక్ష్మి, డా. మాధవి, డా. అనుప్రసన్న, డా. రియాజున్నీసాలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, కార్యదర్శి డా. పి. చిట్టిబాబు, డా. లక్ష్మీనరసింహ, డా. వై. హరిబాబు, డా. నజ్మా, డా. ఖాజాపీర్, సాహిల్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దురాగతాలపై ఎలుగెత్తిన నిఖిలేశ్వర్

కడప కల్చరల్ : విప్లవ కవి నిఖిలేశ్వర్ సమాజంలోని దురాగతాలను ప్రశ్నిస్తూ ప్రజలను మేల్కొల్పేందుకు తన సాహిత్యం ద్వారా ఎంతో కృషి చేశారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం దిగంబర కవుల్లో ఒకరైన నిఖిలేశ్వర్ 86వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా చర్చా కార్యక్రమం నిర్వహించారు. భూతపురి మాట్లాడుతూ నిఖిలేశ్వర్ గురించిన పలు వివరాలను తెలిపారు. 1965 నుంచి నిఖిలేశ్వర్ కలం పేరుతో విప్లవ రచయితల సంఘాన్ని వ్యవస్థీకరించి సేవలు అందించారని తెలిపారు. ఆయన అగ్నిశ్వాస కవితా సంపుటానికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించిందని వివరించారు. మరో సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి , లైబ్రరీ అసిస్టెంట్ ఎస్.రమేష్‌రావు మాట్లాడారు. చర్చా కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, చంద్రకిశోర్, హరికృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.





